సాటివారిని ఆదుకోవడమే మానవత్వం


టైలరింగ్ షాపులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట్: కష్టాల్లో ఉన్న సాటివారిని ఆదుకోవడమే మానవత్వానికి నిదర్శనమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మోండా డివిజన్‌లోని ఓల్డ్‌జైల్‌ఖానా వద్ద సెప్టెంబర్ నెలలో టైలరింగ్ షాపులు కూలిపోయిన విషయం తెలిసిందే. కూలిపోయిన షాపుల స్థానంలో నూతనంగా నిర్మించిన షాపులను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాద విషయాన్ని ప్రభుత్వం, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరితే నేటి వరకు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉండాలని తాను ఒక్కో కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్‌యాదవ్, నాగులు పాల్గొన్నారు.

సందడి చేసిన విద్యార్థులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

రాంగోపాల్‌పేట్: కళాశాల స్థాయి విద్యార్థుల భవిష్యత్‌కు కీలకమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ కళాశాల ఫ్రెషర్స్ డే ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ దశలో తీసుకుని నిర్ణయాలు, కృషి ఎంతో ప్రయోజకులను చేస్తుందని అన్నారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవడం ద్వారా అటు కుటుంబానికి సమాజానికి ఎంతో ఉపయోగపడే వారవుతారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఆటాపాటా, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, కళాశాల ప్రెసిడెంట్ పీఎల్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఈశ్వర్, డైరెక్టర్ సునిల్‌కుమార్, పద్మారావు, వినోద్ పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.29, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 33, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 20, పందిరి బీర 23, క్యాబేజీ 19, క్యారెట్ 47, దొండ 23, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 45, గోకరకాయ 23, కీర 25, దోసకాయ 18, బీట్‌రూట్ 40, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 35, చామగడ్డ 35, మొరంగడ్డ 21, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



రసూల్‌పురా: నగరంలో ప్రసిద్ధి చెందిన తిరుమలగిరి లాల్‌బజార్‌లోని నాగదేవత ఆలయాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజయ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాగుణం కలిగి ఉండాలి


విద్యార్థులతో కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ : విద్యార్థిదశ నుంచే సేవాగుణం కలిగిఉండి, ఆపదలో ఉన్నవారికి అపన్నహస్తం అందించి సామాజక బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ విద్యార్థులకు ఉద్బోధించారు. సీతాఫల్‌మండి శ్రీచైతన్య పాఠశాలలో సాంఘిక శాస్త్ర వేడుకల్లో భాగంగా 'సమాజంలో సంఘ సేవకులు' అంశంపై శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మానవ సేవే మాధవ సేవగా భావించి సమాజానికి అందించే సంఘసేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ షేక్‌అబ్దుల్‌నబీ, డీన్ కృష్ణ పాల్గొన్నారు.

మా సమస్యలను మండలిలో ప్రస్తావించండి


ఎమ్మెల్సీ కవితకు వినతి పత్రం అందజేస్తున్న ఆదివాసి, ఎరుకల సంఘం నాయకులు

లాలాపేట: తెలంగాణ ఆదివాసి, ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శనివారం ఆమె నివాసంలో కలిశారు. ఈ నెల 9నుంచి జరిగే శాసన సభ సమావేశాల్లో ఆదివాసి, ఎరుకల సమస్యలపై శాసన మండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు, సంఘం కార్యనిర్వాహణ అధ్యక్షుడు కుతాడి రవికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అడ్డగుట్ట: గడీల పాలన బద్దలుగొట్టిన రాష్ట్ర ప్రజలు ఏడాది కాలంగా సుఖసంతోషాలతో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇంచార్జ్ ఆదం సంతోష్ పేర్కొన్నారు. ప్రజా పాలన విజయోత్సాలను పురస్కరించుకొని తుకారాంగేట్‌లోని సుభాష్ విగ్రహం వద్ద శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆదం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్ ప్రజా పాలన మొదలుపెట్టి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారన్నారు. నిత్యం నోటిఫికేషన్లు అందిస్తూ నిరుద్యోగాన్ని తగ్గిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆదరిస్తున్నారన్నారు. అనంతరం కళాకారులు తమ ఆటపాటలతో ప్రజలను ఆకట్టుకున్నారు. అదే విధంగా స్థానిక మహిళలందరీ కానుకగా చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఆదం భరత్, రాజు సాగర్, అమర్‌నాథ్, బ్రహ్మాజీ, రమేష్, రాములు, ఎస్. యాదగిరి, రామలీల, హరి, నవీన్ పాల్గొన్నారు.

ఓయూ ఏబీవీపీ నూతన కార్యవర్గం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఆర్ట్స్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఏబీవీపీ అధ్యక్షులు ధృహన్ (ఎంఏ ఫిలాసఫీ), కార్యదర్శిగా శివశంకర్ (ఎమ్మెస్సీ జియో ఫిజిక్స్)గా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తోట లవన్‌కుమార్, ప్రొ.రామకృష్ణ, పగిడిపల్లి శ్రీహరి,సుమన్ శంకర్, జీవన్, పృథ్వీతేజ, కమల్ సురేష్ పాల్గొన్నారు.

ఎన్‌ఈపీని అసెంబ్లీలో వ్యతిరేకించండి

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం (ఎన్ఈపీ–2020) రాష్ట్ర అసెంబ్లీలో వ్యతిరేకించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ రేపటి నుంచి (9న) ప్రారంభంకానున్న అసెంబ్లీలో ఎన్ఈపీ–2020 వ్యతిరేకిస్తూ తీర్మాణం చేసి కేంద్రానికి సమర్పించాలన్నారు. కార్యక్రమంలో గ్యార నరేష్, లెనిన్, నెల్లి సత్య, సాయి భగత్, అశ్వన్, రాఘవేంద్ర, సంతోష్, మహేష్, సలీం పాల్గొన్నారు.

నేడు ప్రజా పాలన విజయోత్సవాలు

అమీర్‌పేట: అమీర్‌పేటలో ప్రజా పాలన విజయోత్సవాలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు.శనివారం బాపూనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతలు రమావత్ కృష్ణకుమార్,రాజరాజేశ్వరీ మాట్లాడుతూ అమీర్‌పేట ధరం కరం రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం వేడుకలు జరుగుతాయని చెప్పారు. వేడుకలకు సనత్‌నగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి కోట నీలిమ ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు.

బ్యాట్ పట్టిన సీతక్క..

క్రికెట్ ఆడి సందడి చేసిన మంత్రి


భారత్ జోడో స్పోర్ట్స్ మీట్‌లో మంత్రి సీతక్క..

సనత్‌నగర్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యనిచ్చి క్రీడాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో జరిగిన భారత్ జోడో స్పోర్ట్స్ మీట్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొద్దిసేపు బ్యాట్ పట్టి క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన జోడోయాత్ర స్ఫూర్తితో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పించడంలో రేవంత్ సర్కార్ ముందుందన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కోట నీలిమ

అమీర్‌పేట: క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని ఏఐసీసీ సభ్యురాలు, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు.అమీర్‌పేట గురు గోవింద్‌సింగ్ మైదానంలో ఎన్ఎస్‌యూఐ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత్ జోడో క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు. క్రీడల్లో రాణించి రాష్ట్రంతో పాటు హైదరాబాద్ మహానగరానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎంపీ ఈటల రాజేందర్


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఈటల

రాంగోపాల్‌పేట్: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ క్లాక్‌టవర్ ప్రాంతంలోని నవకేతన్ కాంప్లెక్స్ వినూత్న ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టి మహిళలను మరింత ముందుకు నడిపించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, వినూత్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నామని వెంకటేష్ పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని చాటిన ఖాదర్ అలీ



లాలాపేట: ఓయూ మాజీ ఉద్యోగి ఖాదర్ అలీ హైదరాబాద్ అంటే హిందూ ముస్లిం భాయి భాయి అంటూ మతసామరస్యాన్ని చాటారు. శనివారం మాణికేశ్వర్‌నగర్‌లో అయ్యప్ప మాల ధరించిన సుమారు 60 మందికి అల్పాహారం అందజేసి అయ్యప్ప పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సెవెన్ టెంపుల్స్ చైర్మెన్ గండి కోట విజయ్‌కుమార్, గురుస్వాములు సహదేవ, ఆనంద్‌కుమార్, రవితేజ, మహేశ్, దాదాపు 60 మంది భక్తులు పాల్గొన్నారు.

డీసీసీ జాయింట్ సెక్రటరీగా నరసింహ

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన ఎర్రడిల్ల నరసింహ సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని శనివారం డీసీసీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఎం. అనీల్‌కుమార్ యాదవ్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ వర్కింగ్ ప్రసిడెంట్ వేముల శ్రీనివాస్, వి. లాజరస్, జి. వెంకటేష్, ఏ. లింగయ్య పాల్గొన్నారు.


నరసింహకు నియామక పత్రం అందజేస్తున్న రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన


శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నవారు

పద్మారావునగర్: అప్సా స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం స్పాన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో 'మాదక ద్రవ్యాల వలన కలిగే నష్టాలు–నివారణా చర్యలు' పై వాచ్ కమిటీ సభ్యులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పీస్ కమిటీ సెక్రటరీ ఖాలీద్, అప్సా ప్రతినిధి బస్వరాజ్ తదితరులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారికి, మానసిక వ్యాధితో బాధపడుతున్న వారికి ఏవిధమైన కౌన్సిలింగ్ ఇవ్వాలి, వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించాలి అనే విషయాలను వివరించారు. మానసిక ఒత్తిడికి గురైన వారు టోల్ ఫ్రీ నెంబర్ 14446 కు కాల్ చేసి ఉచిత సలహాలు, సూచనలు పొందవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్‌డీ ప్రతినిధి శారద, రెసిడేన్షియల్ పీస్ కమిటీ సభ్యురాలు శ్రీలత పాల్గొన్నారు.

అక్రమ కేసులు, అరెస్టులపై బీఆర్‌ఎస్వీ నేతల ఆగ్రహం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో అక్రమ కేసులు, అరెస్టుల పట్ల బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటాం శివ మండిపడ్డారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళనలు చేస్తున్న బీఆర్ఎస్, బీఆర్‌ఎస్వీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి కేసులుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలన ముసుగులో నిర్బంధపాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అశోక్‌యాదవ్, రాంబాబు, మల్లేష్‌ముదిరాజ్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ రోప్'పై చిరువ్యాపారుల ఆగ్రహం


కోట నీలిమకు సమస్యను వివరిస్తున్న చిరువ్యాపారులు

సనత్‌నగర్: 'ఆపరేషన్ రోప్' పేరిట ట్రాఫిక్ పోలీసులు తమను ఇబ్బంది పెడుతున్నారంటూ బేగంపేట ప్రకాష్‌నగర్‌లో చిరువ్యాపారులు ఆందోళనకు దిగారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం ప్రకాష్‌నగర్ ప్రధాన రహదారిలో ఇరువైపులా చిరువ్యాపారులకు చెందిన డబ్బాలను తొలగించి వాహనంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన చిరువ్యాపారులంతా కలిసి ఆందోళన నిర్వహించారు. స్థానిక సీనియర్ నేత విశాల్ సూదం దృష్టికి విషయం తీసుకువెళ్లగా ఆయన వారికి మద్దతుగా నిలిచారు. కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న ఆమె చిరువ్యాపారుల సమస్యను విన్నారు. దీనిపై కోట నీలిమ స్పందిస్తూ బాధితుల సమక్షంలో ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజుతో చర్చలు జరిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: భార్య, పిల్లలు ఇంటికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ పందరి తెలిపిన మేరకు.. ప్రకాశం జిల్లాకు చెందిన భూతపాటి ఆదామ్(38) పదేళ్ల క్రితం నగరానికి వచ్చి ఘట్కేసర్‌లోని ఎదులాబాద్‌లో మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు. కుటుంబ కలహాల కారణంగా భార్య పిల్లలతో తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో వాళ్లు తిరిగిరావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన ఆదామ్ శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో బీబీనగర్ – ఘట్కేసర్ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు.

ప్రొఫెసర్ పై దాడికి ఖండన

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం ప్రొ.చంగయ్య మత ప్రచారం చేస్తున్నారనే నెపంతో భజరంగల్ దళ్ కార్యకర్తలు చేసిన దాడిని ఖండిస్తున్నామని పీడీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కోట ఆనంద్ శనివారం పేర్కొన్నారు. దళితుడైన ప్రొ.చంగయ్య పై దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలన్నారు.

లష్కర్ జిల్లా ఏర్పాటు చేయాలి


మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న లష్కర్ జిల్లా సమతి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని లష్కర్ జిల్లాగా ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. శనివారం మంత్రి నివాసానికి వెళ్లిన సమితి నాయకులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు నూతన జిల్లా ఏర్పాటు అవశ్యకతను వివరించారు. లష్కర్ జిల్లా కోసం కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్నామని పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలకు వినతి పత్రాలను సైతం సమర్పించినట్లు పేర్కొన్నారు. కేంద్రమంత్రిగా కొనసాగుతున్న కిషన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లష్కర్ జిల్లాను ఏర్పాటు చేయాలని లేఖ రాయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిప్రసాద్‌గౌడ్, కమిటీ సభ్యులు బాలరాజుయాదవ్, జగదీష్‌గౌడ్, శైలేందర్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

గారడీ మాటలతో అసత్య ప్రచారం చేస్తున్న సీఎం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ పై సీఎం రేవంత్ రెడ్డి గారడీ మాటలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, గిరిజన విద్యార్థి సంఘం నేత కరాటే రాజు ధ్వజమెత్తారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. టీజీపీఎస్సీలో 75 లక్షల నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకోగా గత బీఆర్ఎస్ హయాంలో ప్రకటించిన 55 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేశారని వివరించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏటా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి రూ.4 వేలు ప్రకటించి ఏడాది గడిచిన ఇంత వరకు కనీసం ఒక్క హామీ ఊసు కూడా ఎత్తడం లేదన్నారు. ఓయూలో కృతజ్ఞత సభ నిర్వహించడం సిగ్గుచేటు అన్నారు.

కంప్రెషర్ వాహనం చోరీ


కంప్రెషర్ వాహనం తీసుకెలుతున్న దొంగ (సీసీ ఫుటేజీ)

బంజారాహిల్స్: కంప్రెషర్ వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించిన సంఘటన ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల వివరాల మేరకు... ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీకి చెందిన డేరంగుల తిరుపతయ్య ఎప్పటిలాగే పనులు పూర్తైన తర్వాత తన కంప్రెషర్ వాహనాన్ని (ఏపీ07 ఏఎన్ 3687) పనిచేసిన ప్రాంతంలో పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లాడు. తెల్లారిలేచి వెళ్లేసరికి అక్కడ తన వాహనం కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలన్నీ గాలించాడు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా దొంగతనం జరిగిన ప్రాంతం నుంచి సీసీ ఫుటేజీలు పరిశీలించగా గగన్‌పహాడ్ వరకు ఈ వాహనం వెళ్లినట్లు కనిపించింది. ఆ తర్వాత సీసీ టీవీ ఫుటేజీల్లో కనిపించలేదు. ఇంత పెద్ద వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసి జబర్దస్తీగా నడుపుకుంటూ తీసుకువెళ్లడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పక్కా ప్రణాళికతోనే దొంగ ఈ భారీ వాహనాన్ని చోరీ చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

ఎలక్ట్రిక్ వాహనం అందజేత


ఎలక్ట్రిక్ వాహనాన్ని అందజేస్తున్న ఎల్ఐసీ ప్రతినిధులు

బంజారాహిల్స్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ రూ.16 లక్షలు విలువైన ఎలక్ట్రికల్ వాహనాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు విరాళంగా అందించింది.

ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ ఎల్ఐసీ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఉపాధ్యక్షుడు మహావిష్ణు దాసు ప్రభు, ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ రీజనల్ మేనేజర్ రామయ్య, సీనియర్ రీజనల్ మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న మిడివెల్లి అన్నపూర్ణ

బంజారాహిల్స్: మున్నూరు కాపు మహిళా పరస్పర సహాయక వినియోగదారుల సంఘం లిమిటెడ్ రాష్ట్ర డైరెక్టర్‌గా బంజారాహిల్స్‌కు చెందిన మిడివెల్లి అన్నపూర్ణ సంపత్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జరిగిన కార్యక్రమంలో సంఘం కార్యనిర్వహణ అధికారి పుటం పురుషోత్తం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ సంఘంలో తాను చేస్తున్న సేవలను గుర్తించి తనకు రాష్ట్ర కమిటీలో డైరెక్టర్‌గా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందని ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. మున్నూరు కాపు మాక్స్ సొసైటీ ద్వారా రైతులకు మేలు చేసే విధంగా సేవలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదిదతరులు పాల్గొన్నారు.